క్లుప్తంగా

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



పెదకూరపాడు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్, స్టిక్కర్, పాకెట్ క్యాలెండర్‌లను మండల సంఘం అధ్యక్షుడు రాయపూడి సాంబశివరావు అధ్యక్షతన శుక్రవారం పెదకూరపాడులోని జిల్లా పరిషత్ పాఠశాలలో మండల విద్యా శాఖ అధికారులు ఏకుల ప్రసాదరావు, సత్యనారాయణలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణ, సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ రహంతుల్లా, యాట్ల రవి, రాష్ట్ర కార్యదర్శులు ప్రసాద్, రమేష్, కృష్ణ, ఎస్తేరు రాణి, వరలక్ష్మి, అనిత, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు.. ఆదాయం రూ.3.97 లక్షలు



రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు కొండపై వేంచేసి ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీలను శుక్రవారం లెక్కించారు. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ దేవస్థానంలో ప్రతీ మూడు నెలలకు ఒకసారి హుండీలను లెక్కిస్తారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు గాను హుండీలను లెక్కించగా రూ.3,97,345 ఆదాయం వచ్చినట్లు ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ఏడాది ఇదే సమయంతో పోల్చుకుంటే రూ.65,502 ఎక్కువ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, దేవరంపాడు సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, దేవస్థానం కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, శ్యామకూరి శ్రీనివాసరావు, పేటసన్నిగండ్ల దేవస్థానం ఈవో సైదమ్మబాయి, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

నార్నెపాడులో ఈవీఎంలపై అవగాహన



నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరును వివరించారు. ఓటు వేయగానే వీవీప్యాట్ నుంచి స్లిప్ బయటకు వస్తుందని, అందులో ఏ సింబల్‌పైన ఓటు వేశారో తనిఖీ చేసుకోవచ్చన్నారు. ఓటర్లకు ఈవీఎంలపై ఉన్న సందేహాలను తొలగించారు. అనంతరం అక్కడే ఈవీఎం ద్వారా నమూనా ఓటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

108 వాహనానికి పార్కింగ్ సౌకర్యం కల్పించండి

సత్తెనపల్లి: పట్టణంలో 108 వాహనానికి పార్కింగ్, సిబ్బందికి వెయిటింగ్ రూమ్ కేటాయించేలా చూడాలని 108 వాహన చోదకుడు కిరణ్ కోరారు. శుక్రవారం ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావులకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి 108 వాహనాన్ని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పార్కింగ్ చేసి అక్కడి వెయిటింగ్ రూమ్ వాడుకుంటున్నామన్నారు. ప్రస్తుతం ఆ రూమ్ శిథిలావస్థకు చేరిందన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ 108 వాహనం ద్వారా విలువైన సేవలు అందిస్తున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ 10 సంవత్సరాల క్రితం 108 సర్వీసులు ప్రైవేట్ వారి ఆధిపత్యంలో ఉండేవన్నారు. ప్రస్తుతం వాటిని ప్రభుత్వ పరిధిలోకి తీసుకుని వచ్చి విలువైన సేవలు నిరంతరం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో 108 సిబ్బంది, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, తదితరులున్నారు.

అక్రమ మద్యం సీసాలు పట్టివేత

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 20 అక్రమ తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యలగాల వీరనారాయణ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచరం మేరకు తనిఖీలు చేపట్టగా ఇంట్లో గుట్టుగా దాచి ఉంచిన తెలంగాణ మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



బ్యాడ్మింటన్ ఆడుతున్న మండెపూడి క్రీడాకారులు



దేచవరం గ్రామంలో క్రికెట్ పోటీలకు సిద్ధంగా ఉన్న క్రీడాకారులు



అనుపాలెం జెడ్పీ పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..ఆడుదాం ఆంధ్రా



కబడ్డీ ఆడుతున్న ఉంగుటూరు క్రీడాకారులు



మునగోడులో ఖోఖో ఆడుతున్న మహిళలు



ముప్పాళ్ళ జెడ్పీ పాఠశాలలో వాలీబాల్ పోటీలు



క్రికెట్ పోటీకి టాస్‌వేస్తున్న అచ్చంపేట హెచ్‌ఎం

- ఉత్కంఠభరితంగా సాగుతున్న ఆటల పోటీలు
- పిల్లల నుంచి పెద్దల వరకు పాల్గొంటున్న వైనం

అమరావతి: విద్యార్థుల నుంచి పెద్దల వరకు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో పాల్గొంటున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి ముందుగా నమోదు చేయించుకున్న ఆసక్తిగల అన్ని వయస్సుల క్రీడాకారులతో ఆటల పోటీలు సాగుతున్నాయి. ఈ పోటీలలో క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ వంటి క్రీడలలో వయస్సుతో సంబంధం లేకుండా పురుషులు, స్త్రీలు పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని చాటుకుంటున్నారు. మండంలోని మునగోడు, మండెపూడి, మల్లాది, లింగాపురం, అమరావతి, ధరణికోట గ్రామాల క్రీడామైదానాలలో శుక్రవారం పోటీలు ఎంతో ఆసక్తికరంగా సాగాయి. జనవరి 9వ తేదీ వరకు గ్రామ స్థాయి పోటీలను నిర్వహించిన అనంతరం 10వ తేదీ నుంచి మండలస్థాయి పోటీలను నిర్వహించటానికి ప్లేగ్రౌండ్‌లను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు..

నకరికల్లు: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు మండలంలో ఉల్లాసభరితంగా సాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలకు విశేష ఆదరణ లభిస్తుంది. మండలంలోని 14 సచివాలయాల్లోను నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా శుక్రవారం దేచవరంలో క్రికెట్ పోటీలు జరిగాయి. గ్రామీణ యువక్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో క్రికెట్ ఆడారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోను క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ చింతా పుల్లయ్య గ్రామస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను మండలస్థాయికి ఎంపిక చేస్తామన్నారు.

రసవత్తరంగా ఆటల పోటీలు..

ముప్పాళ్ళ: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఆటల పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శుక్రవారం దమ్మాలపాడు సచివాలయం పరిధిలో నాలుగు టీంలకు క్రికెట్ పోటీలు ముప్పాళ్ళ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగాయి. పోటీల్లో దమ్మాలపాడు-ఏ టీం విజేతగా నిలిచి మండల స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ముప్పాళ్ళ సచివాలయం పరిధిలో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యాయామ ఉపాధ్యాయులు వ్యవహరించారు. పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, పీలా లక్ష్మణ్, ముప్పాళ్ళ పంచాయతీ కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావులు పర్యవేక్షించారు.

ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీసేందుకే..

అచ్చంపేట: గ్రామస్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టిందని స్థానిక టీఎస్సార్ జెడ్పీ హెచ్‌స్కూలు హెచ్‌ఎం సీహెచ్ కళ్యాణి అన్నారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం పలు సచివాలయాల పరిధిలో జరిగిన క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. కోగంటివారిపాలెం -అంబడిపూడి మధ్య జరిగిన క్రికెట్ పోటీలో కోగంటివారిపాలెం టీము గెలుపొందింది. కోనూరు 1-2 టీముల మధ్య జరిగిన పోటీలో కోనూరు-1, గ్రంథశిరి 1-2లలో గ్రంథశిరి-1, పెదపాలెం 1-2లలో పెదపాలెం-2, వేల్పూరు 1-2లలో వేల్పూరు-2 టీములు విజయం సాధించాయి. పోటీలు శనివారం కూడా నిర్వహించనున్నట్లు పాఠశాల పీడీ ఆలపాటి సుజాత తెలిపారు. క్రీడాకారులు నిర్ణయించిన సమయానికి అరగంట ముందుగా కోర్టులో ఉండాలని తెలిపారు. అచ్చంపేట పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, పంచాయతీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో గ్రామ సచివాలయం పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా కబడ్డీ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో మూడు టీమ్‌లు పాల్గొనగా అనుపాలెం యూత్ టీమ్ గెలుపొందింది. ఈ టీమ్ మండల స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొంటుంది. అన్ని గ్రామ సచివాలయాలలో ఆటల పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. శనివారంతో ముగియనున్నాయి.

క్రీడా పోటీల్లో యువత సత్తా చాటాలి

బెల్లంకొండ: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో యువత సత్తా చాటాలని ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గ్రామాలలో క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. మండల కేంద్రంలో బ్యాడ్మింటన్ పోటీలను ఎంపీపీ ప్రారంభించారు. క్రీడాకారులతో కలసి ఆటలు ఆడారు. క్రీడాకారులు తమలో ఉన్న నైపుణ్యాలను ప్రదర్శించడానికి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ అహ్మద్ పాషా, మండల సచివాలయ కన్వీనర్ వెంకటరెడ్డి, సర్పంచ్‌లు ప్రతాపరెడ్డి, నరసింహనాయక్, రమణారెడ్డి, వెంకట సైదయ్య, బాబూజీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటల పోటీలకు సై..

12 సచివాలయాల్లో కొనసాగుతున్న ఆటల పోటీలు



బయ్యవరంలో వాలీబాల్ ఆడుతున్న మహిళలు



బయ్యవరంలో కబడ్డీ ఆడుతున్న మహిళలు

క్రోసూరు: ఆడుదాం ఆంధ్రా ఆటలు శుక్రవారం మండలంలోని 12 సచివాలయాల పరిధిలో 30 జట్లు ఆడటం జరిగింది. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని పాఠశాలల పీఈటీలు ఆటలను పర్యవేక్షించారు. క్రోసూరు జెడ్పీ పాఠశాలలో జరిగిన క్రికెట్‌ను పీఈటీ శ్రీధర్ పర్యవేక్షించారు. బయ్యవరం జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన ఖోఖో ఆటలను పంచాయతీ కార్యదర్శి యడ్ల శ్రీనివాసరావు పర్యవేక్షించారు. గ్రామాల్లో ఆటలను తిలకించేందుకు విద్యార్థులు, ప్రజలు ఆశేషంగా పాల్గొంటున్నారు. ఆడుదాం ఆంధ్రా ఆటలు యువతకు మంచి ఉత్సాహాన్ని ఇస్తున్నాయని ఎంపీపీ పి.కోటయ్య తెలిపారు. పలు గ్రామాల్లో జరుగుతున్న ఆటలను ఎంపీపీ, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్ సందర్శించారు.

క్రికెట్ అంటే ఎంతో ఇష్టం..



క్రికెట్ అంటే అందరిలాటే నాకు పిచ్చి. సెలవు రోజుల్లో పాఠశాల గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతుంటాం. ఆడుదాం ఆంధ్రా ద్వారా అవకాశం రావటంతో మేము రెండు జట్లుగా ఏర్పడి పేర్లు రిజిస్టర్ చేసుకున్నాం. క్రోసూరు జెడ్పీ పాఠశాల గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్నాం. పై స్థాయికి ఎంపికవుతామన్న నమ్మకంతో ఆడుతున్నాం.

చిలకా రమేష్, క్రికెట్ క్రీడాకారుడు, క్రోసూరు

వాలీబాల్‌లో మా టీం సత్తా చాటుతుంది



మేము పాఠశాల స్థాయి నుంచి వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ ఆడుతుండేవాళ్లం. ఆడుదాం ఆంధ్రా ద్వారా అవకాశం రావటం సంతోషంగా ఉంది. ఆటల పోటీలు మా ఊళ్లోనే ఉండటం ఇంకా ఆనందంగా ఉంది. వాలీబాల్‌లో మా టీం సత్తా చాటుతుంది. మండల జట్టుకు ఎంపికవ్వాలని ఆడుతున్నాం. బాగా ఆడి ఉత్తమ జట్టుగా ఎంపికవుతామని నమ్మకం ఉంది.

సతీష్, వాలీబాల్ క్రీడాకారుడు, క్రోసూరు

నయన శోభిత అలంకారంలో శ్రీవారు



ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, రైల్వేస్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేషమైన అభిషేకాలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి నయన శోభిత అలంకారం నిర్వహించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. సత్తెనపల్లి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శికి సత్కారం



శరత్‌బాబును సత్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఇటీవల నియమితులైన వెలుగూరి శరత్‌బాబును పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం పూలమాలలు, దుశ్శాలువాలు, గజమాలతో మంత్రి అంబటి రాంబాబు సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, నాయకులు కూకుట్ల లక్ష్మీ, కోడిరెక్క దేవదాస్, జూపల్లి పాల్, షేక్ జానీ, చిలుకా రమణయ్య, ఆర్యవైశ్య నాయకులు జెమిలి రాధాకృష్ణమూర్తి, కొత్తూరి విశ్వేశ్వరరావు, తదితరులున్నారు.

అసత్య ప్రచారాలను నమ్మొద్దు

- విధేయతతో, బాధ్యతాయుతంగా సేవలు అందిస్తున్నా
- పచ్చ మీడియా చేసే విషప్రచార ట్రాప్‌లో పడొద్దు
- నన్ను ఓడించటమే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ లక్ష్యం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు



వైఎస్సార్‌సీపీలో చేరిన శివకోటేశ్వరరావుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి అంబటి

సత్తెనపల్లి: నాపై పని కట్టుకొని ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ 5, మరి కొంతమంది అసత్య, విష ప్రచారాలు చేస్తున్నారని పచ్చ మీడియా ట్రాప్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పడవద్దని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు, 13వ వార్డు ప్రెసిడెంట్ గంటా శివకోటేశ్వరరావు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. ఆయనకు మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ గంటా శివకోటేశ్వరరావు టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి సేవలు అందిస్తున్నాడన్నారు. ఆ పార్టీ వ్యవహరిస్తున్న తీరు, విధానాలు నచ్చక వైఎస్సార్‌సీపీలో చేరేందుకు ముందుకు వచ్చాడన్నారు. నియోజకవర్గంలో విధేయతతో, బాధ్యతాయుతంగా సేవలు అందిస్తున్నానన్నారు. ఏదో రకంగా విషం చిమ్మాలనే ఉద్దేశంతో పచ్చమీడియా పని చేస్తోందని, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కూడా తనను ఓడించటమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. మన అధినేత జగన్‌మోహన్ రెడ్డి నేరుగా ప్రకటించే వరకు మన పని మనం చేసుకుందామని, అలా కాకుండా మాట్లాడితే అధినేతను ధిక్కరించిన వారమవుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీనే మళ్లీ అధికారంలోకి వస్తుందని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని అనేక సర్వేలు చెబుతున్నాయన్నారు. గంటా శివకోటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించి పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులను కలుపుకొని పని చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావునాయక్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, పార్టీ నాయకులు అచ్యుత శివప్రసాద్, మల్లికార్జునరెడ్డి, వెంకటేశ్వర్లు, మాధవ, తిరుములరావు, ఏసుబాబు, శరత్‌బాబు తదితరులున్నారు.

ప్రశాంతంగా కౌన్సిల్ అత్యవసర సమావేశం

అజెండాలోని అన్ని అంశాలు ఏకగ్రీవంగా ఆమోదం



మాట్లాడుతున్న చెర్‌పర్సన్



అత్యవసర సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు

సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరీ గ్రేస్ మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ అధ్వానంగా ఉందని ఆ సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ప్రస్తుతం మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో కొంత ఇబ్బంది ఉందని, అయినప్పటికీ మెరుగుపడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. 6వ వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి మాట్లాడుతూ తమ వార్డులో రెండు కల్వర్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్‌కుమార్ పట్టణంలో ప్రధాన ప్రత్యేకంగా కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కడబడితే అక్కడ కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయని వాటిని కట్టడి చేయాలన్నారు. 31వ వార్డు కౌన్సిలర్ మేరీ గ్రేస్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్దేశిత సమయానికి జరిగేలా చూడాలని, ప్రతిసారి ఎక్కువ సమయం వేచి ఉండాలంటే ఇబ్బందిగా ఉంటుందన్నారు. దీనిపై చైర్‌పర్సన్ సమాధానం ఇస్తూ ఈ రోజు కేవలం 15 నిమిషాలు మాత్రమే ఆలస్యమైందని, అలా జాప్యం కాకుండా చూస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావునాయక్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

నియోజకవర్గంలో పలు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే నంబూరు



పెదపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ఆసుపత్రి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గంలో సంక్షేమ పథకాలకు సమానంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. మండలంలోని పెదపాలెంలో నిర్మాణంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరలో వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పెదపాలెం, కొండూరు, నిండుజర్ల, వేల్పూరు గ్రామ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను ఇచ్చేందుకు, లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు మండలంలోని పెదపాలెంలో రూ.4కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ప్రస్తుతం 80శాతం పనులు పూర్తయ్యాయన్నారు. పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాలను కలుపుతూ మాదిపాడు వద్ద కృష్ణానదిపై రూ.60 కోట్ల నాబార్డు నిధులతో వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచామన్నారు. రూ.150 కోట్లతో అమరావతి నుంచి బెల్లంకొండ వరకు డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, పెదపాలెం సర్పంచ్ నెల్లూరి హరిబాబు, మాజీ సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, ఉప సర్పంచ్ షేక్ జాని, మార్కెట్ యార్డు డైరెక్టర్ చిరుమామిళ్ల నరసింహారావు, తాళ్లచెరువు సర్పంచ్ కిక్కురు అర్లారెడ్డి ఉన్నారు.

సీహెచ్‌సీ పనుల పరిశీలన

పెదకూరపాడు: నియోజకవర్గ కేంద్రమైన పెకూరపాడులో రూ.8.65 కోట్లతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అత్యంత ఆధునికంగా నిర్మించామని, ఇకపై ప్రజలకు వైద్యశాల అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం ఆయన సామాజిక ఆరోగ్య కేంద్రం పనులను పరిశీలించారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పన, మిగిలిన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. త్వరలో వైద్యశాల ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవివర్మ ఉన్నారు.

రోడ్ల పనులు పరిశీలన..

మండల కేంద్రంలోని పాటిబండ్ల వెళ్లే రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శుక్రవారం పరిశీలించారు. పెదకూరపాడు నుంచి పాటిండ్ల వరకు ఏఎంసీ నిధులతో తారు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. రెండు రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తవుతుందన్నారు. దీంతో పెదకూరపాడు, పాటిబండ్ల, బుస్సాపురం, జలాలపురం గ్రామాలకు మార్గం సుగమమవుతుందన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్ళూరులోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న 108 మంది విద్యార్థులకు స్వర్గీయ గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి జ్ఞాపకార్థం ఆయన మిత్రుడు విజయవాడ ఆచార్య అకాడమీ డైరెక్టర్ ఎస్.సాంబిరెడ్డి స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు.

పేరు మార్పు

బొమ్మలాపురం మల్లీశ్వరి W/o గురవయ్య, డోర్ నెం. 103 కొడెలకాలని రెంటపాళ్ళ గ్రామము సత్తెనపల్లి మండలము అనునేను నా పేరుని ఇక నుండి బొమ్మలాపురం నాగమణి గా మార్చుకోవటం జరిగింది అని ఈ ప్రకటన ద్వారా తెలియచేయచున్నాను.